క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పూజలు



పూజలందుకున్న సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలోనివల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

హిందూ ధర్మంతో జ్ఞాన వికాసం



ధర్మ ప్రచారం నిర్వహిస్తున్న జ్ఞానవేదిక సభ్యులు

పరవాడ: దేశపాత్రునిపాలెం గ్రామంలో త్రైతసిద్ధాంత హిందూ జ్ఞాన వేదిక, ప్రబోధ సేవా సమితి సభ్యులు మంగళవారం నిర్వహించిన హిందూ ధర్మ ప్రచార కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. త్రైతసిద్ధాంత భగవద్గీత గ్రంథాలు చదివి దేశానికి పూర్వ వైభవం తేవాలన్న లక్ష్యంతో ఇంటింట హిందూ ధర్మ ప్రచారం చేపడుతున్నామని అనకాపల్లి ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దేవి, రేవతి, మణి, పద్మ, అక్షయ్‌కుమార్, సర్వదార, అశోక్ పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి

సబ్బవరం: ఉత్తరాంధ్ర జిల్లాలను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ బలపర్చిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పీవీఎన్ మాధవ్ అన్నారు. మండల కేంద్రం సబ్బవరం సాయినగర్‌లో ఏర్పాటు చేసిన ఆ పార్టీ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. పట్టభద్రుల అంతా తనకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఈర్లె శ్రీరాంమూర్తి,జ్వాలారెడ్డి పరమేష్,రామరాజు,వనం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కళ్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



పూసర్ల వెంకటేష్ (ఫైల్)

సింహాచలం: ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. పెందుర్తి సీఐ జి.అప్పారావు తెలిపిన వివరాలు..పెందుర్తి మండలం గొరపల్లికి చెందిన పూసర్ల వెంకటేష్(32) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అప్పులు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈనెల 22న ఇంట్లో ఓ ద్రావకాన్ని తాగాడు. అతన్ని చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడి భార్య పూసర్ల అనూష మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

విజ్ఞానం.. ప్రగతికి సోపానం



నమూనాలను పరిశీలిస్తున్న ఏపీ అటల్ టింకరింగ్ ల్యాబ్స్ మెంటార్ రాజశేఖర్ తదితరులు



రామన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈవో అప్పలరాజు తదితరులు

- ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం
- వలు విద్యా సంస్థల్లో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహణ

సబ్బవరం: మండలంలోని పలు పాఠశాలలు,కళాశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి మాట్లాడారు. ప్రఖ్యాత శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ భౌతిక శాస్త్రంలో చేసిన విశేషమైన సేవలకు నోబెల్ బహుమతి వరించిందని చెప్పారు. ఆయన ఆవిష్కరించిన రామన్ ఎఫెక్టుకు గుర్తుగా ఏటా ఫిబ్రవరి 28న దేశం అంతటా సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి. శంకర్, గణిత శాస్త్ర అధ్యాపకులు రామకృష్ణ,మిగిలిన అధ్యాపకులు స్వామినాయుడు,రత్నప్రకాష్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

● సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఇన్‌చార్జి హెచ్ఎం చిన్నమ్మాయి ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ప్రదర్శనను మండల విద్యాశాఖాధికారి ఎస్. అప్పలరాజు ప్రారంభించారు. రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● సబ్బవరం ప్రతిభా విద్యాలయంలో నిర్వహించిన సైన్స్ ప్రదర్శనను ఏపీ అటల్ టింకరింగ్ ల్యాబ్స్ మెంటార్ రాజశేఖర్ ప్రారంభించారు. పాఠశాల దశ నుంచే విద్యార్థులకు ఆవిష్కరణలపై ఆసక్తి కలిగేలా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థి దశ నుండే వారిలో శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తి పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా 10 వేల అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ, ప్రిన్సిపాల్ అన్నీజోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.



పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్

సైన్స్‌తో ప్రగతి

సింహాచలం: పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీఆర్ఆర్ వర్మ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్సు ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది.

● సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రిన్సిపాల్ స్వరూప చంద్రకళ ప్రారంభించారు. పాఠశాల జోనల్ ఇన్‌చార్జి ఎస్.వెంకటేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● సుజాతనగర్‌లోని ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్లో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సైన్సు ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. హెచ్ఎం ఎస్.రమాదేవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో..

పరవాడ: పి.బోనంగిలోని సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ప్రదర్శన ఆకట్టుకుంది. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి మాట్లాడుతూ పరిశీలన, ప్రశ్న, పరికల్పన, ప్రయోగం, విశ్లేషణతో కూడిన జ్ఞాన సంపాదనకు సైన్స్ అనేక విధాలుగా దోహదపడుతుందన్నారు.



సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో..



డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి



పెందుర్తి పాఠశాలలో రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్ఎం వర్మ తదితరులు

అటు నేహా..ఇటు అనసూయ

- పరదేశిమాంబ అమ్మవారి ఉత్సవంలో మెరిసిన తారలు
- తన గళంతో ఆకట్టుకున్న మోహన భోగరాజు

సబ్బవరం: ఉదయం భక్తులతో ఆ ప్రాంగణం పులకించింది..సాయంత్రం సెలబ్రిటీలతో సందడి నెలకుంది. డీజే టిల్లు ఫేం నేహాశెట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలవగా..బుల్లితెర బ్యూటీ అనసూయ కిరాక్ పుట్టించింది. బుల్లెట్ బండీ సింగర్ మోహన భోగరాజు తన గళంతో ఈవెంట్‌ను తారాస్థాయికి తీసుకువెళ్లారు. జబర్దస్త్ యాంకర్ సౌమ్యరావు తన మాటలతో ఆకట్టుకున్నారు. మండలంలోని తవ్వవాని పాలెంవాసుల ఆరాధ్య దేవత పరదేశిమాంబ అమ్మవారి ఉత్సవాన్ని మంగళవారం అత్యంత వైభంగా నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పండగ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, పారిశ్రామిక వేత్త బోకం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారం రోజుల పాటు క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన గుర్రపు పందాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు ప్రారంభించారు. అనుపు మహోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన భారీ మందుగుండు పోటీలు మిరుమిట్లు గొలిపాయి. రాత్రికి నిర్వహించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమంతో పాటు రాకెట్ రాఘవ టీమ్‌తో పాటు పలువురు వెండి, బుల్లితెర నటులు సందడి చేశారు.



కళాకారులతో డ్యాన్స్ చేస్తున్న అనసూయ



దౌడు తీస్తున్న గుర్రం



నృత్యం చేస్తున్న కళాకారులు

సీతారామాచార్యులకు ఘన సత్కారం



సీతారామాచార్యులను సత్కరిస్తున్న శృతిలయ సంస్థ ప్రతినిధులు

సీతంపేట: సింహాచలం దేవస్థానం పురోహితులు కర్రి సీతారామాచార్యులను శృతిలయ సాంస్కృతిక సంస్థ మంగళవారం సాయంత్రం ఘనంగా సత్కరించింది. శృతిలయ సాంస్కృతిక సంస్థ ఇటీవల సీతమ్మధారలో నిర్వహించిన శ్రీనివాస కల్యాణం విజయవంతమైన సందర్భంగా ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో అభినందన సభ నిర్వహించారు. కల్యాణానికి సహకరించిన దాతలు, సేవకులను సత్కరించారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఆగమ సంప్రదాయాలపై జాతీయ స్థాయిలో ఇటీవల జరిగిన సదస్సులో శ్రీపాంచరాత్ర ఆగమ సంప్రదాయంపై ప్రసంగించి ప్రముఖుల అభినందనలు అందుకున్న సింహాచలం దేవస్థానం పురోహితులు సీతారామాచార్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శృతిలయ సంస్థ వి.ప్రభాకర్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, పి.రంగనాథాచార్యులు, కొణతాల రాజు, సీహెచ్‌వీ సత్యనారాయణ, మేడా మస్తాన్‌రెడ్డి, వి.ఫణీంద్ర పాల్గొన్నారు.

దేవస్థానాల్లో ఉద్యోగం ఒక వరం



ధర్మారావు దంపతులను సత్కరిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: దేవస్థానాల్లో ఉద్యోగం చేయడం ఒక వరంగా భావించాలని సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు అన్నారు. సింహాచలం దేవస్థానంలో 37 ఏళ్ల పాటు విధులు నిర్వర్తించి మంగళవారం పదవీవిరమణ చేసిన నాలుగోతరగతి ఉద్యోగి ధర్మారావు దంపతులను ఉద్యోగుల సమాఖ్య ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ఈవో త్రినాథరావు మాట్లాడుతూ భగవంతుడికి, భక్తుడికి సేవ చేసే భాగ్యం కొందరికే లభిస్తుందన్నారు. దేవస్థానం ఏఈవోలు ఆనంద్‌కుమార్, ఇజిరోతు శ్రీనివాసరావు తదితరులు ధర్మారావు దంపతులను సత్కరించి వరాహ లక్ష్మీనృసింహస్వామి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్ రాజ్, ఈఈ శ్రీనివాసరాజు, సూపరింటిండెంట్‌లు నిద్దాం నాయుడు, సిరిపురపు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సమావేశం నేడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సమావేశం బుధవారం జరగనుంది. శ్రీ కృష్ణాపురంలోని గోశాలలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుంది. స్వామివారి కల్యాణోత్సవం, చందనోత్సవంతో పాటు ఇతర పనులపై చర్చించనున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో దేవస్థానం అధికారులు ఎలక్షన్ కమిషన్‌ను సంప్రదించారు. ఈ మేరకు చీఫ్ ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా సమావేశం నిర్వహణకు షరతులతో కూడిన అనుమతి ఇచ్చారు.

చోరీ కేసులో మహిళ అరెస్ట్

సింహాచలం: నగరంలో జరిగిన శుభకార్యానికి వచ్చిన వృద్ధ దంపతుల బ్యాగ్ దొంగిలించిన మహిళను పెందుర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. క్రైం ఎస్ఐ సల్మాన్ బేగ్ తెలిపిన వివరాలు ... సికింద్రాబాద్ నుంచి జయంతి విజయలక్ష్మి, అచ్యుతరావు దంపతులు ఓ శుభకార్యం నిమిత్తం సోమవారం రాత్రి 7గంటల సమయంలో విశాఖపట్నం వచ్చారు. పెందుర్తి దరి పురుషోత్తపురం వెళ్లేందుకు ఆటో ఎక్కి బ్యాగ్‌ను ఆటో వెనుకభాగంలో పెట్టారు. పురుషోత్తపురం చేరుకున్న తర్వాత ఆటో వెనుక ఉన్న బ్యాగ్ కనిపించకపోవడంతో ఆందోళన చెందారు. అందులో ఎనిమిది తులాల బంగారం, కొత్త వస్త్రాలు ఉన్నాయి. వెంటనే పెందుర్తి క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు రైల్వేస్టేషన్ నుంచి పెందుర్తి వరకు ఉన్న పలు సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించారు. పాత రికార్డుల ఆధారంగా విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన ఒక మహిళ బ్యాగ్ దొంగిలించినట్టు గుర్తించారు. ఆమెను పట్టుకుని ఎనిమిది తులాల బంగారం, కొత్త దుస్తులు రికవరీ చేశారు.

రైఫిల్ షూటింగ్ పోటీల విజేతలకు అభినందన

పరవాడ: పి.బోనంగిలోని సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో 9 తరగతి చదువుతున్న ఎస్.సుందరరామిరెడ్డి, ఎస్.సురేంద్ర జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు చెప్పారు. వీరు నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగుతున్న ఎయిర్ వెపన్ ఆల్ ఇండియా ఓపెన్ పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. మార్చి 1 నుంచి 7 వరకు ఢిల్లీలో జరుగే రైఫిల్ పోటీల్లో వీరు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



పూజలో పాల్గొన్న ఉభయదాతలు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు పాల్గొన్నారు.

2న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో మార్చి 2న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి పూజలో పాల్గొనవచ్చని ఆమె పేర్కొన్నారు.

కళాకారులకు పురస్కారాలు



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖరత్న కళాపరిషత్ సంయుక్తంగా స్థానిక పౌరగ్రంథాలయంలో నందమూరి శతజయంతి వేడుకల నెలవారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 10వ నెల కార్యక్రమంలో భాగంగా ఉత్తరాంధ్ర కళాకారులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. డీటీఎస్ ఆనంద మిమిక్రీ, చందు జాంగ్లింగ్ షో, శ్రీనివాస్ జానపద గీతాలు, మల్లికా, రామారావు, భాస్కర్లచే కామెడీ స్కిట్స్ ప్రేక్షకులను మెప్పించాయి. అనంతరం వివిధ రంగాలలో సేవలందిస్తున్న వారికి అతిథులుగా విచ్చేసిన సామాజిక విశ్లేషకులు సన్‌మూర్తి, శంఖారావం సంస్థ అధ్యక్షులు బొమ్మిడి సత్యనారాయణ, ఆంధ్రాబ్యాంకు విశ్రాంత మేనేజర్ సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా ఎన్టీఆర్ పురస్కారాలతో సత్కరించారు. డాక్టర్ కందుకూరి విజయమోహనరావు, నమ్మి అప్పలరాజుయాదవ్, దొరబాబు, రామకృష్ణ, మల్ల అప్పారావు, టి.ఎస్.ఆనంద్ వరప్రసాద్, కరకవలస కృష్ణమూర్తి, జి.ఎస్.ఎన్.మూర్తి, రాము, కోరాడ నారాయణరావు, జగదీష్ ఎన్టీఆర్ పురస్కారాలు అందుకున్నారు. సంస్థ వ్యవస్థాపకులు పి.ఎ.భాస్కరరావు, కార్యదర్శి మల్లిక పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో అడవిరాజు, భాస్కర్ పలువురు కళాకారులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ టైలర్స్ డే

సీతంపేట: గ్రేటర్ విశాఖ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో ప్రపంచ టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. టైలరింగ్ మెషీన్ సృష్టికర్త ఐజాక్ మెరిట్ సింగర్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. సొసైటీ అధ్యక్షుడు సి.హెచ్.యాదగిరిరెడ్డి మాట్లాడుతూ రెడీమేడ్ రంగం విస్తరించడంతో దర్జీల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. టైలరింగ్ సొసైటీకి సామాజిక భవనం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

డాక్టర్ వరప్రసాద్‌కు జాతీయ అవార్డు



కంచరపాలెం: కంచరపాలేనికి చెందిన డాక్టర్ మాముడూరి వరప్రసాద్‌కు మధ్యప్రదేశ్‌లోని సోషియల్ పాయింట్ ఫౌండేషన్ చైర్మన్ అభిషేక్ చేతుల మీదుగా 2022–23 సేవలకు గుర్తింపుగా 'భారత్ భూషణ్' అవార్డు అందుకున్నారు. సామాజిక, రాజకీయ రంగాల్లో ఉత్తమ సేవలకు గానూ ఈ అవార్డు అందుకున్నట్టు డాక్టర్ వరప్రసాద్ తెలిపారు.

ఉత్సాహంగా నడక పోటీలు



నడక పోటీల్లో పాల్గొన్న మహిళలు

మురళీనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా మాధవదార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మురళీ నగర్ వాకర్స్ క్లబ్ ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం మహిళలకు నడక, క్విజ్ పోటీలు, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. నడకపోటీలను వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య ప్రారంభించారు. నడక పోటీలు ఐదు విభాగాలుగా నిర్వహించారు. మ్యూజికల్ చైర్, క్విజ్ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఈనెల 3వ తేదీన బహుమతులు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి, కార్యదర్శి ఎస్.పుష్పలత, పూర్వ అధ్యక్షురాలు కె.మాధవి, ఉపాధ్యక్షురాలు సీహెచ్. వరలక్ష్మి, లీలా నాయుడు, ఓం వాకర్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రమీల, వైభవ్ వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్.దుర్గా ప్రసన్న పాల్గొన్నారు.

7న పైడిమాంబ పండగ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గ్రామ పెద్దలు

పరవాడ: పరవాడ గ్రామంలో ఈ నెల 7న నిర్వహించనున్న పైడిమాంబ అమ్మవారి ఉత్సవాల పోస్టర్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, రైతు సంఘ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, పెద్దలు సిరపరపు రాజేష్, పైల హరీష్, పోతల అప్పలనాయుడు, పైల అప్పలనాయుడు, సిరపరపు అయ్యబాబు, పైల పైడినాయుడు, బంగారుబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న కేంద్రం



747వ రోజు దీక్షలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

కూర్మన్నపాలెం: కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడమే కాకుండా, రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలను ప్రజలు తిప్పికొట్టే సమయం ఆసన్నమైందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో 747వ రోజు సంస్థకు చెందిన డీఎస్‌డబ్ల్యూ, ఈఆర్ఎస్‌డీ, ఈటీఎల్ కార్మికులు కూర్చున్నారు. కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీలకు కొమ్ము కాస్తూ, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలను విరమించుకోవాలని కోరారు. కార్మిక శేయస్సు కోరి ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణ నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని, లేదంటే కేంద్ర ప్రభుత్వానికి ప్రజాతీర్పుతో తగిన గుణపాఠం నేర్పుతామని అన్నారు.

ఆటోనగర్ 'డి' బ్లాక్‌లో 'స్వచ్ఛ పక్వాడా'

పాల్గొన్న ఎంఎస్ఎంఈ, వాసీవా, ఐలా ప్రతినిధులు



ఆటోనగర్ డి బ్లాక్‌లో రోడ్లు శుభ్రం చేస్తున్న ఎంఎస్ఎంఈ, వాసీవా, ఐలా ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్ డిబ్లాక్‌లో మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) ఆధ్వర్యంలో ఆటోనగర్ ఐలా, విశాఖ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) సహకారంతో స్వచ్ఛ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. డీ బ్లాక్‌లోని విశాఖ రూఫింగ్ ఇండస్ట్రీ వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ అధికారులు, వాసీవా, ఐలా ప్రతినిధులు, పలువురు పారిశ్రామిక వేత్తలు పాల్గొని, రోడ్లను శుభ్రపరిచారు. పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. బ్యానర్లను చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. తమ పరిశ్రమలతో పాటు చుట్టూ ఉన్న పరిసరాలన్నీ శుభ్రంగా ఉండేటట్లు నిర్వహణ చేపడతామని పారిశ్రామిక వేత్తలు ప్రతిజ్ఞను చేశారు. కార్యక్రమంలో ఐలా కమిషనర్ కె.సూర్యనారాయణ, వాసీవా అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ, ఉపాధ్యక్షుడు కృష్ణప్రసాద్, ఐలా ఉపాధ్యక్షుడు కొల్లి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ, ఎంఎస్ఎంఈ ఏడీ, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ ప్రభాకర్ కుమార్, ఎస్.ఎల్.ఎన్.కుమార్, రెడ్డి, అప్పికొండ శ్రీనివాస్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.